సాక్షి ప్రకాశం

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి నేరాల శాతం తగ్గేందుకు కృషి చేయాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

- 8లో..



ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

బైక్‌పై వెళ్తున్న యువకుడిని కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన తర్లుపాడు మండలం నాగెళ్లముడుపులో జరిగింది.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గ్రేస్ లినోర

ఒంగోలు అర్బన్: జిల్లాలో కళాకారుల గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు కళాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి కే గ్రేస్ లినోర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కళాకారులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున కళాకారులు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన కళాకారులు దరఖాస్తుతో పాటు సంబంధిత ప్రొఫార్మాలో పేరు, బ్లడ్ గ్రూప్, పుట్టిన తేదీ, చిరునామా, కళారూపం పేరు, కళా ప్రదర్శనలో ఉన్న అనుభవం ఇతర వివరాలతో దరఖాస్తును జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఈనెల 7వ తేదీలోపు అందజేయాలని తెలిపారు.

12న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.జాలి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని జెడ్పీ సీఈఓ కోరారు.

ప్రైవేటు విద్యార్థులు పది పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: 2024 మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరుకాబోయే ప్రైవేటు విద్యార్థులు (2023 ఏప్రిల్/ జూన్‌లో జరిగిన పరీక్షల్లో తప్పిన విద్యార్థులు) పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఫీజును ఈనెల 10వ తేదీ లోగా అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో అక్టోబరు 16వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో అక్టోబరు 23 వరకు, రూ.500 అపరాధ రుసుముతో అక్టోబరు 30 వరకు ఫీజును సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్స్ లింకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు తమకు కేటాయించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డు ద్వారా లాగిన్ కావాలన్నారు. మూడు సబ్జక్టుల వరకు రూ.110, మూడు సబ్జక్టులకు మించితే రూ.125 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైతే రూ.80 చెల్లించాలన్నారు.

తెల్లబంగారంపై ఆశలెన్నో..

గతేడాది కాసుల వర్షం కురిపించిన తెల్లబంగారంపై ఈ ఏడాది కూడా రైతులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. మద్దతు ధర కంటే సుమారు రూ.4 వేలు అధికంగా పలికింది. ప్రస్తుతం మార్కెట్లో ఆశించిన మేరకు పత్తి ధరలు లేకపోయినా రానున్న రోజుల్లో మంచి రేటు వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగంలోకి దిగితే కొనుగోళ్లు ఊపందుకునే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

- గతేడాది రైతులకు లాభాలు తెచ్చిపెట్టిన పత్తి
- ఈ సారి ధరలపైనే దృష్టి
- నెలాఖరు నుంచి ఊపందుకోనున్న కొనుగోళ్లు
- రంగంలోకి సీసీఐ
- 33,918 హెక్టార్లలో సాగు లక్ష్యం



పత్తి పంటలో పత్తిని తీస్తున్న కూలీలు

రాచర్ల/ఒంగోలు సబర్బన్: జిల్లాలో దాదాపు 26 మండలాల్లో పత్తి పంట సాగుచేస్తున్నారు. సుమారు 33,918 హెక్టార్లలో సాగు లక్ష్యం. సాధారణంగా ఈ పంటను జూన్ నెల నుంచి అక్టోబర్ వరకూ సాగుచేస్తుంటారు. గత సంవత్సరం 46,478 హెక్టార్లలో పత్తిని సాగు చేశారు. దాదాపు 92,956 టన్నుల పత్తిని విక్రయించారు. నాణ్యతను బట్టి గత సంవత్సరం ప్రభుత్వం రెండు రకాలుగా మద్దతు ధరను క్వింటాకు రూ.6,080, రూ.6,380 ప్రకటించింది. అయితే గత సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే అధికంగా పలకడంతో రైతులు లాభాల బాట పట్టారు. క్వింటా ధర రూ.9,500 నుంచి రూ.10,500 వరకూ పలికింది. అయితే ఈ సారి దిగుబడి బాగా తగ్గిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం దిగుబడులు పూర్తి కావచ్చిన గ్రామాలకు వ్యాపారులు వచ్చి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.6,200 నుంచి రూ.7,000 వరకు చెల్లిస్తున్నారు. పత్తి కొనుగోలుకు సంబంధించి గుంటూరు మార్కెట్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్రత్యేక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది . వీరు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. గుర్తించిన ఏఎంసీల్లో వారి సిబ్బంది వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇప్పటికే సీసీఐ సన్నాహాలు మొదలు పెట్టింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ధరలు పుంజుకునే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖరు వరకూ కొనుగోళ్లు జరుగుతాయి. ప్రభుత్వం సైతం మద్దతు ధర ప్రకటించాల్సి ఉంది.

పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది పత్తి పంటలో పెట్టుబడులు పెరిగిపోయాయి. విత్తనం వేసిన మొదలు పంట దిగుబడులు చేతికొచ్చే వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. పత్తి పంటకు చీడపీడలు ఆశించకుండా ముందస్తు జాగ్రత్తగా పంటపై మందులు పిచికారి చేయాలిది. పత్తి పంటలో అంతర్గత సేద్యాలు, కలుపు తీసే కూలి ఖర్చులు, ఎరువులు, పురుగుల మందులు, పత్తి తీసేందుకు కూలీలకు కూలి కలుపుకుని ఎకరాకు రూ.25 వేలకు పైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. సీసీఐ తొందరగా మేలుకొని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు.

దిగుబడులపైనా ఆశలు..

గత ఏడాదితో వచ్చిన లాభాలతో కొంత మంది రైతులు వేసవిలో పత్తిని సాగు చేశారు. ఆ సాగుకు సంబంధించి దిగులుబడి భారీగా పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ధరలు బాగా ఉండడంతో ఈ ఏడాది బోర్ల కింద అత్యధికంగా సాగు చేశామని చెబుతున్నారు. ఎకరాకు 7 క్వింటాళ్లకు మించి రావడంలేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల ఎర్ర భూముల్లో ఎకరాకు 3 క్వింటాళ్లు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో అక్కడ దిగుబడికి ఎలాంటి ఇబ్బంది ఉండది వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా సాగు లక్ష్యం ఇలా..

మండలం	విస్తీర్ణం హెక్టార్లలో
అర్ధవీడు	2094
కనిగిరి	55
కురిచేడు	1407
కొనకనమిట్ల	883
కొమరోలు	605
కంభం	635
గిద్దలూరు	1943
చీమకుర్తి	80
టంగుటూరు	2.00
తర్లుపాడు	560
తాళ్లూరు	58
త్రిపురాంతకం	737
దర్శి	1316
దొనకొండ	2533
దోర్నాల	2024
నాగులుప్పలపాడు	202
పుల్లలచెరువు	3101
పెద్దారవీడు	2572
బేస్తవారిపేట	2284
మార్కాపురం	4009
ముండ్లమూరు	785
యర్రగొండపాలెం	2949
రాచర్ల	2710
హనుమంతునిపాడు	17
మద్దిపాడు	29
పొదిలి	144

ప్రత్యామ్నాయం వైపు చూపు..



వర్షాలు పడిన ప్రాంతంలో మంచిదిగుబడి వస్తుంది. వర్షాలు తక్కువ ఉన్న ప్రాంతాల్లో మాత్రం దిగుబడి కొంతమేరకు తగ్గే అవకాశం ఉంది. అడుగులోపు ఉన్న పత్తి మొక్కలు తీసేసి ప్రత్యామ్నాయంగా మిర్చి సాగువైపు దృష్టిసారిస్తున్నారు.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీ, వ్యవసాయశాఖ

ఈ ధరలకు అమ్మితే నష్టపోతాం



ప్రస్తుతం ఉన్న ధరలకు పత్తిని అమ్మితే నష్టపోతాం. సాగులో పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు తగ్గిపోయాయి. గత ఏడాది పత్తి క్వింటా రూ.9,800 నుంచి రూ.10 వేల వరకు పత్తి అమ్ముకున్నాము. 2 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. రూ.35 వేలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకూ రెండు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది.

– షేక్.మాసీన్, పత్తి రైతు, గొతవరం

రేటు కోసం ఎదురుచూపు



పత్తి ధరల కోసం ఎదురుచూస్తున్నాం. మంచి ధరలు వచ్చే వరకు పత్తిని అమ్ముకునే పరిస్థితి లేదు. ఈ ఏడాది వర్షాలు కూడా లేకపోవడంతో దిగుబడులు కూడా సరిగాలేవు. ప్రస్తుతం వ్యాపారులు కొంటున్న రేటు పెంచకపోతే నష్టాలపాలవుతాం. సీసీఐ వస్తే ధరలు పెరుగుతాయన్న ఆశ ఉంది.

– దద్దు చిన్న తంగెళ్ల, పత్తి రైతు, జేపీ చెరువు

ప్రతి ఇంటికీ వైద్య సేవలు చేరువ

- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- హెల్త్ క్యాంపుల్లో ప్రభుత్వ వైద్యులతో పాటు ప్రైవేటు వైద్యుల సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు అర్బన్: ప్రతి పేదవానికి, ప్రతి ఇంటికి మెరుగైన వైద్యసేవలు చేరువ చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును బాలినేని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడుతూ ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న డాక్టర్, పారామెడికల్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు వైద్య కళాశాలకు పీజీ సీట్లు పెంచారన్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీలో వ్యాధుల సంఖ్యను పెంచి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో గ్రామ స్థాయిలో వైద్య సేవలు ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్య సేవలు మరింత దగ్గర కాగా.. జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు పూర్తి భరోసా కలిగిందన్నారు. ఇంటింటి సర్వే చేసి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి నిర్వహించే హెల్త్ క్యాంపుల్లో తగిన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దురదృష్టవశాత్తు ఏదైనా పెద్ద వ్యాధి ఉంటే వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రిఫరల్ ఆస్పత్రులకు పంపుతారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్ల సేవలు అందించడం సంతోషకరమన్నారు. స్పెషలిస్టు సేవలు కూడా ఈ క్యాంపుల్లో అందుబాటులో ఉంచారంటే ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంత ప్రాముఖ్య ఇస్తున్నారో అర్థమవుతోందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందన్నారు. కోవిడ్ సమయంలో కూడా దేశంలో మన రాష్ట్రం ఉత్తమ సేవలు అందించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నీ వర్గాలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అండగా నిలవడంతో పాటు వైద్య సేవలు అందించడంలో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అమలు చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి జగనన్న సురక్ష కార్యక్రమంపై పూర్తి వివరాలను ప్రజలకు తెలిపారు. దీనిలో కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, గోపి, నాగభూషణం, కమలమ్మ, పార్టీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి మందులు, వైద్యపరీక్షల రిపోర్టుల కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు వివరాలు నమోదు చేయాలి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ 2023 పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగానే ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్‌లో ఉండేలా నవంబరు 30వ తేదీలోగా నమోదు చేసుకోవాలి. 2019 నవంబరు, 2021 నవంబరు, 2022 మార్చిలో ఎంపికైన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు/ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాది కూడా తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. లేకుంటే స్కాలర్‌షిప్ మంజూరు కాదన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాల వారే దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని, సకాలంలో తమ వివరాలు నమోదు చేయాలని డీఈవో సూచించారు.

భగీరథ ఫ్యాక్టరీని తరలించాల్సిందే



మాట్లాడుతున్న మేయర గంగాడ సుజాత



నగరపాలక కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

- నిషేధిత కెమికల్స్ వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి
- రెండేళ్ల క్రితమే తరలిస్తామని భగీరథ యాజమాన్యం అంగీకరించింది
- ఒంగోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- 16వ డివిజన్‌లో ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా నిధులు
- ప్రశ్నోత్తరాల సమయాన్ని తీసుకొనిమరీ తోకముడిచిన ప్రతిపక్ష టీడీపీ సభ్యులు
- ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు నగర పరిధిలో ఉన్న భగీరథ కెమికల్ ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాల్సిందేనని ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల సాధారణ, అత్యవసర సమావేశాలు వరుసగా నిర్వహించారు. నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ అజెండాలో ఐదో అంశంగా ప్రవేశపెట్టారు. దీంతో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య భగీరథ కెమికల్ ఫ్యాక్టరీని ఇక్కడ నుంచి తరలించాలని ప్రతిపాదన పెట్టారు. దీంతో 600 మందికి ఉపాధి కల్పిస్తున్న ఫ్యాక్టరీని తరలించటాన్ని వ్యతిరేకిస్తున్నామని టీడీపీ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన సభ్యులు టీడీపీ సభ్యుల వాదనను తిప్పికొట్టారు. చెరువుకొమ్ముపాలెం, యరజర్ల, పెళ్లూరు, ఒంగోలు మండలంలోని కొన్ని గ్రామాలు, ఒంగోలు నగరంలో కూడా భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీ వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. ప్రజలతో పాటు పశు పక్షాదులు కూడా అనారోగ్యం పాలవుతున్నాయని సమావేశంలో ప్రస్తావించారు. దీంతో కల్పించుకున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కాలుష్య నియంత్రణ విభాగం అధికారులు ఫ్యాక్టరీలో ఉత్పత్తులను ఆపేయాలని నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. దీంతో భగీరథ యాజమాన్యం కూడా రెండు సంవత్సరాల్లో విడతల వారీగా ఫ్యాక్టరీలో ఉత్పత్తులను తగ్గించుకుంటూ పోయి రెండేళ్ల తరువాత ఫ్యాక్టరీని ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు కొండపి నియోజకవర్గంలోని మరికొన్ని గ్రామాల ప్రజలు కూడా నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. దీంతో మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ భగీరథ కెమికల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అవుతున్న కొన్ని కెమికల్స్‌ను ప్రపంచంలోని కొన్ని దేశాలు నిషేధించాయని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కర్నాటకలోని రాయచూర్‌లో కొత్త ప్లాంటును భగీరథ యాజమాన్యం నిర్మించుకుంటోందని వైఎస్సార్‌సీపీ సభ్యులు చెప్పారు. 38వ డివిజన్‌లో గతంలో అప్రూవల్ లే అవుట్‌లో వదిలిన డొంకకు సంబంధించిన అంశంపై ప్రస్తావన వచ్చినప్పుడు ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశాన్ని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు అడ్డుకున్నారు. డైరెక్టరేట్ నుంచి అడిగిన సమాచారాన్ని కౌన్సిల్ తీర్మానానికి పెట్టారని, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడకూడదని ప్రతిపక్ష సభ్యులకు చురకలు వేశారు. పారిశుధ్య కార్మికులను అదనంగా తీసుకొని సేవలు వినియోగించుకునే విషయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రమైన చర్చ జరిగింది. దీంతో అధికార వైఎస్సార్‌సీపీ సభ్యులు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు టీడీపీ సభ్యుల వాదనను అడ్డుకున్నారు. కోవిడ్ సమయంలో పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకొని ఇప్పుడు వారిని పక్కన పెడదామనటం సబబు కాదని అన్నారు. అనంతరం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. నగరంలోని 16వ డివిజన్‌లో తాగునీటి సరఫరా సరిగ్గా లేనందున 2020–21 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.85 కోట్లు సర్దుబాటు చేసుకొని బాలాజీ నగర్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు వినియోగించాలని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

వీటితో పాటు మొత్తం మీద అత్యవసర, సాధారణ సమావేశాల అజెండాలోని 18 అంశాలకు గాను 17 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ప్రశ్నోత్తరాల సమయం కావాలని మేయర్‌ను కోరారు. దీంతో కౌన్సిల్ ఆమోదించింది. అంటే అజెండాలోని అంశాలతో పాటు అందులో లేని అంశాలైన నగరంలోని సమస్యలను కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురావాల్సి ఉంది. అలాంటిది ప్రశ్నోత్తరాల సమయాన్ని తీసుకొని కూడా దానిని విస్మరించి ఇచ్చిన అవకాశాన్ని వదిలేసి వెళ్లిపోయారు. కమిషనర్ వెంకటేశ్వరరావు సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అక్కడికక్కడే సమాధానాలు ఇచ్చి పరిష్కరించారు. సమావేశంలో ఏసీపీ కేవీ.వెంకటేశ్వర్లు, ఎంసీ జానీ, శానిటేషన్ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘వెలిగొండ’ పునరావాస పనులు వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ కుమార్

- వెలిగొండ ప్రాజెక్టుపై సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇళ్ల పట్టాల మంజూరుతో పాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజి అమలు వేగంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ప్రకాశం భవనంలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు, నిర్వాసితుల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో సొరంగ మార్గం పనులు పూర్తి చేసేందుకు కావాల్సిన సమయంపై చర్చించారు. నీటి విడుదల సామర్థ్యం సాధ్యాసాధ్యాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ నారదముని, డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఈ అబుసలీం, ఇతర అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని బ్రిటన్ రోడ్డులో నివాసం ఉంటున్న ఇనుప కొట్టు వ్యాపారి ప్రభాకర్‌పై జీడి పప్పు, బాదం పప్పు వ్యాపారం నిర్వహించే సూరే మల్లికార్జున గత నెల 29వ తేదీన హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మల్లికార్జునను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం


మృతి చెందిన వెంకటేశ్వర్లు

తర్లుపాడు: బైక్‌పై వెళ్తున్న యువకుడిని కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో తర్లుపాడు మండలంలోని నాగేళ్లముడుపు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుర్రా వెంకటేశ్వర్లు(30) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా కర్రలలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద విషయాన్ని పోలీసులకు గ్రామస్తులు తెలియజేశారు.

ఇంటర్మీడియెట్ విద్యార్థిని బలవన్మరణం

పెనమలూరు: సెల్‌ఫోన్ చోరీ ఆరోపణలతో మనస్తాపం చెందిన ఇంటర్‌మీడియట్ విద్యార్థిని మంగళవారం బలవన్మరణం చేసుకుంది. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు.. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన హెచ్.వెంకటరవి, లలిత దంపతుల కుమార్తె మాదేవిప్రియ (17) కానూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. కాలేజీలో గత శనివారం సిబ్బందికి చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. కాలేజీ యాజమాన్యం ఈ ఘటనపై సీరియస్ అయ్యింది. ఆ సెల్ ఫోన్ ఆదివారం మాదేవిప్రియకు క్యాంపస్‌లో దొరకటంతో యాజమాన్యానికి అప్పగించింది. అయితే కాలేజీ యాజమాన్యం ఆమెపైనే అనుమానం వ్యక్తం చేసింది. తనకు ఫోన్ దొరికిందని మాదేవిప్రియ చెప్పినా ఫోన్ చోరీ చేశావంటూ యాజమాన్యం మందలించింది. దీంతో విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం క్లాస్ జరుగుతున్న సమయంలో వాష్ రూమ్‌కు వెళ్లి వస్తానని బయటకు వచ్చిన ఆమె పై అంతస్తులో ఖాళీగా ఉన్న రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె మరణానికి కాలేజీ యాజమాన్యందే బాధ్యతని మాదేవిప్రియ తండ్రి వెంకటరవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాలేజీ కరస్పాండెంట్ నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్ కోటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని సీఐ రామారావు తెలిపారు.

జనారోగ్యం..

జగనన్న అభయం

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో సువర్ణాధ్యాయం లిఖించారు. పట్టణాలకే పరిమితమైన సూపర్‌స్పెషాలిటీ వైద్యులు పల్లె జనుల చెంతకు వెళ్లి నాడి పట్టేలా చర్యలు చేపట్టారు. మంచానికే పరిమితమైన రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి 'ఫ్యామిలీ డాక్టర్' రూపంలో భరోసా ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వలంటీర్, ఏఎన్ఎం, ఎంపీడబ్ల్యూ బృందం ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయగా.. సర్వే నివేదిక ఆధారంగా పల్లెల్లో వైద్య శిబిరాలు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో గత మూడు రోజులుగా వేలాది మంది ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. బీపీ, సుగర్, నేత్ర, రక్త పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, ఎక్సరే తీసి మందులు అందజేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఒంగోలులో వైద్య పరీక్షల విభాగాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి


చీమకుర్తి : చినరావిపాడులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


ఒంగోలులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న ప్రజలు


ఊళ్లపాలెం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో పాల్గొన్న గ్రామస్తులు


వెలిగండ్ల మండలం మొగుళ్లూరులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్


కొండపి మండలం అనకర్లపూడిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వరికూటి


అర్ధవీడు మండలం నాగులవరంలో ఓపీల నమోదు..


ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు బీపీ,షుగర్ తదితర పరిక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


హనుమంతునిపాడు: సీతారామపురంలో కిడ్నీ పరీక్షలు చేస్తున్న వైద్యులు


దర్శి ఎంపీపీకి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


కొనకనమిట్ల: పాతపాడులో వేచిఉన్న గ్రామస్తులు


ఒంగోలులో మహిళలకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది


వైపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

● ఎస్పీ మలికాగార్గ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

కురిచేడు: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి నేరాల శాతం తగ్గించేందుకు కృషి చేయాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆమె వార్షిక తనిఖీ చేశారు. తొలుత పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. రికార్డులు పరిశీలించి కేసులపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పక్క జిల్లా పోలీసులతో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ దొంగతనాలు, నేరాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు అమలు చేయాలని సూచించారు. టెక్నాలజీపై అవగాహన పెంచుకుంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల్లో దర్యాప్తు తీరుతెన్నులు, పురోగతిపై అధికారుల వివరణ తీసుకున్నారు. కేసుల ఛేదింపులు, దర్యాప్తు విధానాలపై దిశా నిర్దేశం చేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. చోరీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలని ఆదేశించారు. పాత, కొత్త నేరస్తులపై నిఘా పెంచాలన్నారు. సచివాలయ మహిళా పోలీసులు పాఠశాలలకు వెళ్లి బాలికలకు ప్రభుత్వం చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై నిత్యం ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. పాతపోలీస్‌స్టేషన్ భవనాన్ని కూల్చి చదును చేయాలని సూచించారు. పంచాయతీ మహిళా పోలీసులు పడమరనాయుడుపాలెం, పడమర వీరాయపాలెం మహిళా పోలీసులు కె.రజిత, వై శివవాణిలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే పోలీస్‌కానిస్టేబుళ్లు ఆర్ చిన కొండయ్య, జి.యుగంధర్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, సీఐ పాపారావు, కురిచేడు, దొనకొండ ఎస్సైలు ఎం దేవ కుమార్, యం సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకం పేరుతో డబ్బు వసూలు

మార్కాపురం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విశ్వకర్మ పథకం ద్వారా అకౌంట్లలో డబ్బులు వేయిస్తానని ఓ మహిళ తమ వద్ద రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేసిందని మంగళవారం రాత్రి పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. నెహ్రూ బజారులో ఒక ఆన్‌లైన్ సెంటరు నిర్వాహకురాలు సుమారు 500 మంది వద్ద నగదు వసూలు చేసింది. గత వారం రోజులుగా ఈ వ్యవహారం నడిచింది. తమకు ఎందుకు నగదు వేస్తారని అనుమానించిన కొందరు బాధితులు నిర్వాహకురాలిని నిలదీయడంతో నీళ్లనమిలింది. సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితులు నేరుగా వెళ్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ మహిళను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.


స్వామిత్వ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వామిత్వ సర్వేపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రకాశంభవనం నుంచి సంక్షేమ, అభివృద్ధి అంశాలపై మంగళవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓలు వారి పరిధిలోని గ్రామాల్లో పర్యటించి స్వామిత్వ సర్వేలో పురోగతి వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 69 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. 43 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, 14 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్, 12 గ్రామాల్లో ఆర్‌ఓఆర్ ప్రాసెస్‌లో ఉన్నట్లు తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామ పంచాయతీలు చూడచక్కని గ్రామాలుగా మార్చేందుకు వినూత్నంగా ఆలోచించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనిపై మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పరిశీలించాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలన్నారు. గ్రామాల్లోని వీధుల వెంట చెత్త నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా రెండు పూటల బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవల నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ 24 లోగా తప్పనిసరిగా పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓలు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ నారాయణరెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ పేరయ్య, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఈఓ సుబ్బారావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి, సచివాలయాల నోడల్ అధికారి, ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటింగ్ పరికరాల యాక్సెప్టెన్సీ టెస్ట్


సీఈఓ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు తదితరులు

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటింగ్ పరికరాల యాక్సెప్టెన్సీ ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) ముఖేష్‌కుమార్‌మీనాకు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం సీఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓకు జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని కలెక్టర్ తెలియజేశారు. జిల్లాకు అవసరమైన వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు వచ్చాయని తెలిపారు. వీవీ ప్యాట్ల పరిశీలన ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని పేర్కొన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పనితీరును బుధవారం నుంచి పరిశీలిస్తామని, అందుకుగాను బెంగళూరు బెల్ సంస్థ నుంచి ముగ్గురు ఇంజినీర్లు జిల్లాకు వస్తున్నారని తెలిపారు.

సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్య పటేల్, డీఆర్ఓ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పెద్ద వ్యాధుల నుంచి ఊరట

● రాష్ట్ర ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్


నందిపాడులో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్

మద్దిపాడు: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రోగులకు పెద్ద వ్యాధుల నుంచి ఊరట కల్పిద్దామని రాష్ట్ర ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని నందిపాడులో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం 1054 రోగాలకే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తుండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవిలోకి వచ్చిన తరువాత 3250కి పైగా రోగాలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేయించడానికి అవకాశాలు కల్పించారని అన్నారు. ఈక్రమంలో మెడికల్ క్యాంప్‌లు 12 రకాల పరీక్షలు అక్కడికక్కడే నిర్వహిస్తున్నారని 174 రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలందరి ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. ఈక్రమంలో ఆయన స్వయంగా రోగులతో మాట్లాడుతూ పరీక్షలు చేయించి అనంతరం వారిని డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలను పూర్తిగా విన్నారు. మెడికల్ క్యాంప్‌నకు వచ్చిన రోగుల్లో పెద్ద వ్యాధులు ఉన్నవారిని కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. ఎంత పెద్ద జబ్బు అయినా వారికి వైద్యం చేయించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని, ఈ విషయం అందరికీ అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత బాధ్యతగా ఉన్న ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని, సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మద్దిపాడు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని దొడ్డవరప్పాడు సమీపంలోని ఏడు గుండ్లపాడు డొంకలో జరిగింది. ఎస్సై వివరాల ప్రకారం...మృతుడు రావెళ్ల కృష్ణ(55) కొండపి మండలంలోని కట్టావారిపాలెం కాగా ప్రస్తుతం పేర్నమిట్టలో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడుగుండ్లపాడు దొడ్డవరప్పాడు డొంకలోకి మోటార్ సైకిల్‌పై వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పశువుల కాపరులు మంగళవారం మధ్యాహ్నం డొంక వైపు వెళ్లగా వ్యక్తి మృతి చెంది ఉండడం గమనించి సర్పంచ్ బెజవాడ రాముకు తెలియపరచగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంటనే ఘటనా వెళ్లి పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.